క్లుప్తంగా

ప్రజలకు కాసు క్రిస్మస్ శుభాకాంక్షలు



పిడుగురాళ్ల: గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నియోజక వర్గ ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తును ఆరాధిస్తూ, ఆయన బోధనలు అనుసరించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. పండగను క్రైస్తవ సోదరులు ఎంతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



విజయపురిసౌత్: నాగులవరం గ్రామంలో ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొందిన జక్కల అచ్చయ్యకు మాచర్ల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఆదేశాలతో రూ.50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం అందజేశారు. టీడీపీ నాయకుడు శ్రీరామమూర్తి, శివ నాగు, శివ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు వినతి



దాచేపల్లి : జాతిపిత మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు మంగళవారం కమిషనర్ ఎంవీ అప్పారావుకి వినతి పత్రం అందజేశారు. నారాయణపురం ఆర్ అండ్‌బీ బంగ్లా సెంటర్, నడికుడి రైల్వేస్టేషన్ రోడ్ల వద్ద ఈ విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి కోరారు. పరిశీలించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌన్సిలర్లు నాగుబంగి గురువులు, వందనపు వెంకట్రామయ్య, దాచేపల్లి వాసవి సేవా సమితి వ్యవస్థాపకులు గరిణే పుల్లారావు, మండ్లేం రామారావు, కె. శ్రీనివాసరావు, పి. శ్రీనివాసరావు తదితరులున్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



గురజాల : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ అన్నారు. స్థానిక శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కమిషనర్ అభినందించారు. గురజాల గ్రామానికి చెందిన షేక్ జానీ బాషా కుమారుడు జహీర్ అన్నదానానికి పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు బండి రవి, సభ్యులు కనకం హనుమంతరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా అన్నమ్మ



మాచర్ల : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శిగా బోలెద్దుల అన్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం విజయవాడ ఏఐటీయూసీ దాసరి నాగ భూషణం భవన్‌లో యూనియన్ రాష్ట్ర 6వ మహా సభ జరిగిందన్నారు. ఈ మహా సభ అనంతరం నూతన కమిటీలో తనకు అవకాశం కల్పించిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం జీవో కనీస వేతనం కోసం, వారికి రావాల్సిన హక్కులు సాధనకు ఉద్యమాలు చేస్తామన్నారు.

మద్యం అరువు అడిగారని ఘర్షణ


రెంటచింతల: రెంటాల గ్రామంలోని మద్యం బెల్ట్‌షాపు వద్ద సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొందరు యువకులు స్థానిక ఆటో స్టాండ్ వద్దనున్న బెల్ట్ షాపులో మద్యం కోసం వెళ్లారు. అప్పు అడగడంతో షాపు నిర్వాహకుడు నిరాకరించాడు. దీంతో యువకులకు, నిర్వాహకులకు ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ విషయమై ఎస్ఐ సీహెచ్ నాగార్జునను వివరణ కోరగా ఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు తెలిపారు.




విద్యుద్దీపాలతో అలంకరించిన చర్చి



కొత్తపల్లి గ్రామంలో పరిశుద్ధ రక్షకుని దేవాలయం



విద్యుత్ వెలుగుల్లో కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చి



ప్రత్యేక అలంకరణలో కల్వరి కొండ



లూర్థు మాత చర్చిలో మేరి మాతకు అలంకరణ



ముటుకూరు ఏఈఎల్‌సీ చర్చి

క్రిస్మస్ పండగ.. కాంతులు నిండగా..

దాచేపల్లి : సర్వమానవాళీ పాప పరిహార రక్షణార్థం ఏసుక్రీస్తు భూ లోకంలో జన్మించారు. ఏసు క్రీస్తు పుట్టుకను జ్ఞాపకం చేసుకుని క్రిస్మస్ పండుగ జరుపుకుంటారు. ప్రభువైన ఏసుక్రీస్తు జననం ద్వారా ప్రతి ఒక్కరి పాపాలు క్షమింపబడతాయని ప్రవక్తలు ప్రకటించారు. బుధవారం వేడుకలు జరుపుకునేందుకు చర్చిలను ముస్తాబు చేశారు. ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. దాచేపల్లి నగర పంచాయతీ, గ్రామీణ ప్రాంతాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. స్థానికంగా ఉన్న లూథరన్ చర్చి, హోసన్నా మందిర్, ఆర్సీఎం, బాప్టిస్ట్, పెంతెకొస్తుతో పాటుగా ఇతర చర్చిల్లో క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు నిర్వహించనున్నారు. క్రీస్తు పుట్టుకపై సండే స్కూల్ చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

మాచర్ల రూరల్: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని క్రీస్తు దేవాలయాలు, బాల ఏసు జన్మదిన దృశ్యాల అలంకరణలు చేపట్టారు. రాయవరం లూర్థు మాత చర్చికి విద్యుత్ అలకరణ చేసి, మేరి మాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఏసు ప్రభువు జనన వృత్తాంతం తెలియజేసే విధంగా చర్చిలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు ఫాదర్ రత్నబాబు నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తపల్లి గ్రామంలో పరిశుద్ధ రక్షకుని దేవాలయం (ఆర్‌సీఎం చర్చి)లో పాస్టర్ మ్యాథ్యూ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణతో రంగు రంగుల దీపాల వెలుగులతో చర్చిని అలంకరించారు. క్రిస్మస్ ట్రీ నమూనాలను చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.



మాచవరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



ర్యాలీ చేస్తున్న హోసన్నా మందిర్ దైవ సేవకులు, విశ్వాసులు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి, మాచవరం, గంగిరెడ్డిపాలెం, మల్లవోలు గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందస్తుగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు జనన సందేశాన్ని తెలియజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు సందేశాత్మక నాటికలు అలరించాయి.

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు చర్చిలను క్రిస్మస్ సందర్భంగా విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ స్టార్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రార్థనలకు ఆయా చర్చీల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గురజాల : స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చి, క్రీస్తు లూథరన్ చర్చిలో పెద్ద స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద కూడా స్టార్‌లను ఏర్పాటు చేసి ఇళ్లకు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

రెంటచింతల: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గ్రామంలోని పలు చర్చిలు, పాఠశాలల్లో బాల ఏసు జన్మించిన పశువుల పాకలను గుర్తు చేస్తూ ఏర్పాటు చేసుకున్న పాకలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కానుకమాత చర్చిలో, సాగర్‌మాత జూనియర్ కళాశాల వసతి గృహంలో, ఫాతిమా మాత, లూర్థు మాత, ఆరోగ్య మాత మందిరాల వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ పశువుల పాకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారి బాల ఏసు, ముగ్గురు రాజులు, పశువుల కాపరుల చిన్నచిన్న బొమ్మలతో, రంగురంగుల విద్యుద్దీపాలను క్రీస్తు జన్మదినం గుర్తుకు వచ్చేలా అలంకరించారు.



కానుకమాత చర్చి ఆవరణలో పశువుల పాక



తెలుగు బాప్టిస్టు చర్చిలో ఏర్పాటు చేసిన స్టార్

దుర్గి: ముటుకూరు గ్రామంలోని ఆంధ్ర ఇవాంజలికల లూథరన్ చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ కె.ఏసుదానం సందేశమిచ్చారు. చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చర్చి ఫాదర్, డెలిగేట్, పీసీసీ మెంబర్స్, సంఘ పెద్దలు, యవనస్థులు, స్త్రీల సమాజం చిన్నారులు పాల్గొన్నారు.

గురజాల రూరల్ : చర్లగుడిపాడు గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు లూథరన్ దేవాలయంలో చర్లగుడిపాడు ప్యారిస్ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి. రెవరెండ్ ఏసు రత్నం, కృపమ్మ క్రిస్మస్ సందేశమిచ్చారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి ఉద్యోగి సామేలు రచించిన క్రీస్తు పుట్టుక నాటికను సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డెలికేట్, సండే స్కూల్ టీచర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



ఫాతిమా మాత మందిరంలో క్రిస్మస్ పశువులపాక

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు కంది పంట సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ రామమ్మ

రెంటచింతల: కంది పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మిట్టగుడిపాడు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు కంది పంట సాగులో మెళకువలు వివరించారు. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను అమర్చి.. పురుగు ఉనికిని గమనించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు పంటలకు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

మాచవరం: మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలను ఏవో కె.రామమ్మ రైతులకు వివరించారు. శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురం తండాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పత్తి, మిరప, కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ యాకూబ్, రైతులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళనను భగ్నం చేసిన పోలీసులు

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు ఎలైన్‌మెంట్ మార్చాలంటూ రైతులు తలపెట్టిన రాస్తారోకోను పోలీసులు భగ్నం చేశారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు వలన విలువైన భూములు కోల్పోతున్నామంటూ పలు గ్రామాల రైతులు జొన్నలగడ్డ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిశోర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఉదయమే జొన్నలగడ్డ రోడ్డుకు చేరుకున్నారు. జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, కేసానుపల్లి, రావిపాడు గ్రామాలకు చెందిన రైతులు రింగ్‌రోడ్డుకు వద్దకు వచ్చారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. డీఎస్పీ నాగేశ్వరరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు రైతులకు పరిహారం పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. జేసీతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

వేస్ట్ పికర్స్ తమ పిల్లల అభివృద్ధికి కృషిచేయాలి

బల్లబళ్లు, రిక్షాలు అందజేసిన డీఆర్వో మురళి

నరసరావుపేట: వేస్ట్ పికర్స్ తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి అభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, అడిషనల్ జిల్లా మెజిస్ట్రేట్ ఏకా మురళి కోరారు. మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్ఎస్) ఆధ్వర్యంలో సీబీఎస్ కాలనీలో ఏడుగురు వేస్ట్ పికర్స్‌కి ఏర్పాటు చేసిన బల్ల బళ్ళు, రిక్షాలను డీఆర్వో పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందజేసే ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పిస్తే అభివృద్ధి చెందుతారన్నారు. స్కూల్లోనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని, చదువుకోడానికి పుస్తకాలు, డ్రస్సు, ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు చేశారని, తద్వారా పిల్లలకు చదువుకొని ప్రయోజకులను చేసేందుకు తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డీబీఆర్ఎస్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, సిటీ కోఆర్డినేటర్ తోకలసాంబయ్య, ఓఎల్ సి సెంటర్ టీచర్ నక్కతామస్ పాల్గొన్నారు.

క్రైస్తవ పాటల పోటీలకు ఆహ్వానం

చిలకలూరిపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ పాటల పోటీలను ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అందెల శౌరి తెలిపారు. పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అంబేడ్కర్‌భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. స్త్రీ, పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతిగా రూ. 3వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 2వేలు, తృతీయ బహుమతిగా రూ. వెయ్యి, మూడు కన్సోలేషన్ బహుమతులుగా రూ. 500 తో పాటు మెమెంటోలు అందజేయబడతాయన్నారు. వివరాలకు 9951197170, 9154031013లను సంప్రదించాలన్నారు.


అడవుల పరిరక్షణ స్ఫూర్తి యాత్ర

కారెంపూడి: నల్లమల అటవీ పరిరక్షణకు పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) చేస్తున్న కృషిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యావరణ ప్రేమికులు మంగళవారం పేర్కొన్నారు. అడవుల పరిరక్షణ చర్యల్లో తాము పాలుపంచుకోవాలని కారెంపూడి తరలివచ్చిన పల్లె సృజన పత్రిక ప్రతినిధులు, పలువురు ప్రకృతి ప్రేమికులు జాజితో పాటు నల్లమలలో సోమ, మంగళవారాలు పర్యటించారు. అడవిలో ఉన్న ప్లాస్టిక్, ఇతర గాజు సీసాల వ్యర్థాలను నాలుగు బస్తాల దాకా ఏరివేశారు. జాజి విలువైన ఔషధ మొక్కలను వారికి పరిచయం చేశారు. ఇలాంటి అరుదైన మొక్కలు నల్లమల అడవి ప్రాంతంలోనే ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ పర్యటన తమకు ఎంతోగానో ఉల్లాసాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చిందని పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తిని నింపిందని సంతృప్తి వ్యక్తం చేశారు.




ఔషధ మొక్క గురించి వివరిస్తున్న జాజి

సమస్యల పరిష్కారానికి సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుటుంబరావు



వేమవరంలో సదస్సులో పాల్గొన్న తహసీల్దారు క్షమారాణి

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వైపీ కుటుంబరావు పాల్గొన్ని భూ సమస్యలపై రైతులు ఇచ్చిన 11 అర్జీలను స్వీకరించారు. రైతుల అర్జీలను పరిశీలన చేసిన తహసీల్దార్ వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సర్వేయర్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

మాచవరం: గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిస్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. వేమవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. రైతుల నుంచి 6 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. జెడ్పీటీసీ శివాయాదవ్, సర్వేయర్ సాల్మన్, వూమవరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరావు, వీఆర్ఓ అఖిల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల సత్వరమే పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మం కోరారు. మంగళవారం రెంటాల గ్రామంలో వీఆర్వో నెవలి శంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ పాల్గొని, మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామస్తులు 7 అర్జీలు అందచేసినట్లు తెలిపారు. ఈఓ గాదె రామిరెడ్డి, వీఆర్వో వెంకయ్య, చేర్రెడ్డి కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, సర్వారెడ్డి పాల్గొన్నారు.

అమ్మబోతే తేమ శాతం.. ఆరబోస్తే వర్షార్పణం



గన్నవరంలో వరి ధాన్యానికి పట్టలు కప్పుతున్న రైతులు



కంభంపాడు ధాన్యం కాపాడుకునేందుకు మహిళా రైతు పాట్లు

ఆరుగాలం అన్నదాత శ్రమకు ప్రతిఫలం లేకుండా పోతోంది. పంట కోత సమయంలో వాయు గుండం రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. వరి ధాన్యాన్ని ఆరబోసి, బస్తాలకు ఎత్తి అమ్మజూపే సమయంలో అకస్మాత్తుగా వర్షాలు రావటంతో పొలాల్లో ఉరుకులు పరుగులు తీశారు. ధాన్యం రాశుల మీద టార్పాలిన్ పట్టలు కప్పుతూ కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. అసలే ధ్యాన్యానికి సరైన గిట్టుబాటు లేక వ్యాపారులకు 75 కిలోల బస్తా రూ.1,300 నుంచి రూ.1,400 విక్రయిస్తూ..నష్టాలను చవిచూస్తున్నారు. ప్రభుత్వం తేమ శాతం సాకుతో సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు తేమ శాతం తగ్గించేందుకు కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోశారు. ఆకస్మిక వర్షాలతో.. తడిసిన ధాన్యం ఎవరు కొనుగోలు చేస్తారు అనుకుంటూ మదనపడుతున్నారు. కోత సిద్ధంగా ఉన్న పంట ఈదురు గాలులతో నేలవాలిపోయి.. గింజలు నేలపాలవుతాయోమేనని భయపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధ్యాన్యాన్ని, రైతుకు సరైన గిట్టుబాటు ధర అందించి రైతన్నలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

– మాచర్ల రూరల్



జమ్మలమడకలో ఇలా..

వీఆర్వో మృతి

గురజాల: గురజాల –1 గ్రామ రెవెన్యూ అధికారి ఆదినారాయణ (44) మంగళవారం సాయంత్రం మృతిచెందారు. రెండు నెలల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా వినుకొండ నుంచి గురజాల బదిలీపై వచ్చారు. గురజాలతో పాటు, గొట్టిముక్కల, తేలుకుట్ల, పులిపాడు గ్రామాలకు ఇన్‌చార్జి వీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి

బొల్లాపల్లి : విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతిచెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బండ్లమోటు ఎస్ఐ ఎ. బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం వెల్లటూరుకు చెందిన అర్ధలపూడి విజయలక్ష్మి (47) విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయింది. ఇంటి ముందు డ్రెయినేజీ పూడిక తీయడానికి డాబాపై ఉన్న ఇనుప రాడ్డు తీసుకొని వస్తుండగా విద్యుత్ తీగలు ఇనుపరాడ్డుకు తగలడంతో ఇది గమనించని విజయలక్ష్మి షాక్‌కు గురైంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి భర్త , ఇద్దరు సంతానం. కుమారుడు ఎ.అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.